తగ్గనున్న స్మార్ట్‌ఫోన్ ధరలు

దిగుమతి సుంకాల్లో కోత

న్యూఢిల్లీ, జనవరి 31: స్మార్ట్‌ఫోన్ల ధరలు దిగిరానున్నాయి. ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టకముందే మొబైల్ ఫోన్ విడిభాగాలపై దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించినందున స్మార్ట్‌ఫోన్ల ధరలు 3-5 శాతం మధ్య తగ్గుతాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. బ్యాటరీ కవర్, లెన్స్, సిమ్ సాకెట్ తదితర మొబైల్ ఫోన్ తయారీలో వినియోగించే విడిభాగాలపై దిగుమతి సుంకాన్ని 15 శాతం నుంచి 10 శాతానికి తగ్గిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ తాజాగా ప్రకటించింది. సెల్యులార్ మొబైల్ తయారీకి ఉపయోగించే అన్ని విడిభాగాలపై దిగుమతి సుంకం 10 శాతానికి పరిమితం చేస్తూ నోటిఫై చేసింది. సుంకాల్లో కోత పెట్టినందున, ఫోన్ల తయారీ సంస్థల వ్యయాలు తగ్గుతాయని, ఈ ప్రయోజనాన్ని త్వరలో వినియోగదారులకు మళ్లిస్తాయని పరిశ్రమ నిపుణులు చెప్పారు. ముఖ్యంగా ఎంట్రీ, బడ్జెట్ స్మార్ట్‌ఫోన్ల ధరలు 3 నుంచి 5 శాతం వరకూ తగ్గవచ్చని వెల్లడించారు. దేశంలో మొబైల్ తయారీకి ప్రోత్సాహకంగా తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ప్రధానికి, ఆర్థిక మంత్రికి కేంద్ర టెలికం మంత్రి అశ్వినీ వైష్ణవ్ కృతజ్ఞతలు తెలిపారు.

జీఎస్టీ వసూళ్లు 1.72 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 31: జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. జనవరి నెలలో రూ.1.72 లక్షల కోట్ల మేర జీఎస్టీ వసూలైనట్లు ఆర్థిక మంత్రిత్వశాఖ తాజాగా వెల్లడించింది. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత ఇంతటి స్థాయిలో వసూలవడం ఇది రెండోసారి కాగా, అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1.70 లక్షల కోట్ల కంటే అధికంగా నమోదవడం ఇది మూడోసారి. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.1,55,922 కోట్లతో పోలిస్తే 10.4 శాతం అధికమయ్యాయని పేర్కొంది. జనవరి 31, సాయంత్రం 5 గంటల వరకు రూ.1,72,129 కోట్ల జీఎస్టీ వసూలైనట్లు పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి వరకు రూ.16.69 లక్షల కోట్ల జీఎస్టీ వసూలయ్యాయి.

బడ్జెట్ ముందు
బుల్ రన్

ముంబై, జనవరి 31: మధ్యంతర బడ్జెట్‌కు ముందు స్టాక్ మార్కెట్లు రంకేశాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుతోపాటు అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లపై తీసుకోనున్న నిర్ణయం మదుపరులను కొనుగోళ్లవైపు నడిపించాయి. గురువారం మోదీ సర్కార్ వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడుతుండటం, వడ్డీరేట్లపై ఫెడ్ తీసుకునే నిర్ణయంపై పెట్టుబడిదారులు దృష్టి సారించారు. ప్రారంభంలో భారీగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివర్లో 612. 21 పాయింట్లు అందుకొని 71,752. 11 పాయింట్లకు చేరుకోగా, మరో సూచీ నిఫ్టీ 203.60 పాయింట్లు అందుకొని 21,725.70 వద్దకు చేరుకున్నది. మరోవైపు, బుధవారం స్టాక్ మార్కెట్లో లిస్టైన నోవా అగ్రిటెక్ షేరు అదరకొట్టింది. ఇష్యూ ధర రూ.41 కంటే 36.56 శాతం అధికంగా రూ. 56 వద్ద లిస్టైంది. చివరకు 43.38 శాతం లాభపడి రూ.58.79 వద్ద ముగిసింది.

ఆశ.. నిరాశేనా!

బడ్జెట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఉద్యోగ, పారిశ్రామిక వర్గాలు

న్యూఢిల్లీ, జనవరి 31: కేంద్ర బడ్జెట్ అనగానే యావత్తు దేశంలోని అన్ని రంగాలూ ఎన్నో ఆశలు పెట్టుకుంటాయి. ముఖ్యంగా వ్యాపార, పారిశ్రామిక వర్గాలు, వేతన జీవుల నుంచి డిమాండ్లు కోకొల్లలు. అయితే ఈసారి వస్తున్నది ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్. లోక్‌సభ ఎన్నికలకు ముందు తాత్కాలిక పద్దును కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. దీంతో పెద్దగా ప్రకటనలేవీ ఉండబోవన్న అంచనాల మధ్య ఆశావహుల్లో ఒక్కసారిగా నీరసం నెలకొంటున్నది. అయినప్పటికీ ఎన్నికల దృష్ట్యా మోదీ సర్కారు ఏవైనా తాయిలాలు అందిస్తుందేమోనన్న ఊహాగానాలూ వినిపిస్తున్నాయి. కానీ ఇప్పటికే ఆదాయ పన్నుల వంటి వాటి జోలికి వెళ్లే అవకాశాల్లేవని మంత్రి నిర్మలా సీతారామన్ సంకేతాలిచ్చారు. అయినా పన్ను శ్లాబులు, రేట్లను సవరించాలన్న డిమాండ్లు మాత్రం వస్తూనే ఉన్నాయి. అందరికీ బీమాతోపాటు పొదుపునకు పెద్దపీట వేసేలా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు, చర్యలను అంతా ఆశిస్తున్నారు.

ఆతిథ్య రంగం నుంచి..

ఆతిథ్య రంగాన్ని ఉత్సాహపర్చేలా బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఏవైనా నిర్ణయాలు తీసుకుంటుందా? అన్న కోణంలో హోటల్స్ యాజమాన్యాలు ఎదురుచూస్తున్నాయి. పర్యాటకుల్ని ఆకట్టుకునేలా మౌలిక సదుపాయాల కల్పనకు నిధులను కేటాయించాలని హిల్టన్ గోవా జనరల్ మేనేజర్ అమన్‌దీప్ సింగ్ గ్రోవర్ అంటున్నారు. ద్రవ్యోల్బణం కారణంగా టూరిస్టులు వెనుకడుగు వేస్తున్నారని, వ్యయ భారం నుంచి ఊరట లభించేలా ప్రభుత్వం వైపు నుంచి చర్యలుంటే బాగుంటుందని హయత్ సెంట్రిక్ జనరల్ మేనేజర్ శిల్పి ఖన్నా అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా కరోనా సమయంలో ఆతిథ్య రంగం తీవ్ర నష్టాలను చవిచూసిందని గుర్తుచేశారు. ఇప్పటికీ వాటిని భర్తీ చేసుకోలేకపోతున్నామని వాపోయారు. లీవ్ ట్రావెల్ అలవెన్సు (ఎల్‌టీఏ)లపై పన్నులను తొలగించాలని కోరుతున్నారు.

మూలధన వ్యయంపై దృష్టి పెట్టాలి

ఈ మధ్యంతర బడ్జెట్‌లోనూ మూలధన వ్యయంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నీతి ఆయోగ్ మాజీ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్ అన్నారు. ప్రైవేట్ పెట్టుబడులు ఇంకా బలహీనంగానే ఉన్నాయని, వీటిలో జోష్ పెరిగితేనే భారత ఆర్థిక వ్యవస్థకూ ఉత్సాహం వస్తుందని అభిప్రాయపడ్డారు.

55 శాతానికి ద్రవ్యలోటు

ఈ ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను కేంద్ర ప్రభుత్వం ద్రవ్యలోటును రూ.17.86 లక్షల కోట్లుగా నిర్దేశించుకున్నది. దేశ జీడీపీలో ఇది 5.9 శాతాన్ని మించవద్దనుకున్నది. అయితే ఇందులో 55 శాతం నిరుడు డిసెంబర్ ఆఖరు నాటికి నమోదైందని కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) బుధవారం తెలియజేసింది. గత ఏడాది ఏప్రిల్-డిసెంబర్ మధ్య ప్రభుత్వ ఖర్చులు రూ.30.54 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఆదాయం రూ.20.71 లక్షల కోట్లుగా ఉన్నది. దీంతో ద్రవ్యలోటు రూ.9.83 లక్షల కోట్లుగా నమోదైంది. నిర్దేశిత రూ.17.86 లక్షల కోట్లలో ఈ మొత్తం 55 శాతానికి సమానంగా ఉన్నట్టు సీజీఏ ప్రకటించారు. ప్రభుత్వ ఆదాయాన్ని మించి వ్యయాలుంటే వాటి మధ్య ఉన్న వ్యత్యాసాన్నే ద్రవ్యలోటుగా పరిగణిస్తారన్న విషయం తెలిసిందే.

హైదరాబాద్‌లో బిగ్‌'సి' షోరూంలో సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్24 సిరీస్ స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరిస్తున్న సినీనటి మృణాల్ ఠాకూర్. చిత్రంలో బిగ్‌'సి' ఫౌండర్, సీఎండీ బాలు చౌదరి, కంపెనీ డైరెక్టర్ వై స్వప్నకుమార్

బిగ్‌'సి'లో గెలాక్సీ ఎస్24 సిరీస్ ఫోన్లు

మాదాపూర్, జనవరి 31: ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో అగ్రగామి సంస్థ సామ్‌సంగ్‌కు చెందిన అధునాతన ఫీచర్లతో కూడిన గెలాక్సీ ఎస్ 24 సిరీస్ మొబైల్ ఫోన్ బిగ్‌'సి' షోరూంలలో అందుబాటులోకి వచ్చింది. ఈ మొబైల్‌ను బిగ్‌'సి' ఫౌండర్ బాలుచౌదరితో కలిసి ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ... శాంసంగ్ గెలాక్సీ ఎస్ 24లో ఆల్ట్రా, ఎస్ 24 ప్లస్‌తో మార్కెట్‌లోకి విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బాలు చౌదరి మాట్లాడుతూ.. గెలాక్సీ ఎస్ 24 సిరీస్ ఫోన్లలో అత్యంత అధునాతన ఫీచర్స్ కలిగివున్నాయని, లైవ్ ట్రాన్స్‌లేట్, టు-వే రియల్ టైం వాయిస్, చాట్ అసిస్ట్, ఫోన్ కాల్స్ టెక్స్ట్స్ ట్రాన్స్‌లేషన్, ఇంటర్‌ప్రిటర్, ఆండ్రాయిడ్ నోట్ అసిస్ట్, ట్రాన్స్‌స్క్రిప్ట్ అసిస్ట్ వంటి అత్యాధునిక ఫీచర్లు కలిగి ఉన్నాయని, విజవల్ ఇంజన్, క్వాడ్ టెలిసిస్టం, 5ఎక్స్ ఆప్టికల్ జూమ్ లెన్స్, ఎన్‌హ్యన్స్ డిజిటల్ జూమ్, నైటోగ్రఫీ వంటి ఫీచర్లను పొందుపరిచినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న బ్యాంక్ ఆఫ్ బరోడా

మూడో త్రైమాసికంలో రూ.4,579 కోట్ల లాభం

న్యూఢిల్లీ, జనవరి 31: ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,579 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2022-23 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.3,853 కోట్ల కంటే 19 శాతం అధికంగా నమోదైనట్లు బ్యాంక్ పేర్కొంది. ఏడాది క్రితం రూ.27,092 కోట్లుగా ఉన్న బ్యాంక్ ఆదా యం గత త్రైమాసికంలో రూ.31,416 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. దీంట్లో వడ్డీల మీద వచ్చే ఆదాయం రూ.23,540 కోట్ల నుంచి రూ.28,605 కోట్లకు పెరిగినట్లు వెల్లడించింది. అలాగే బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 4.53 శాతం నుంచి 3.08 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 0.99 శాతం నుంచి 0.70 శాతానికి దిగొచ్చినట్లు పేర్కొంది. మరోవైపు, బ్యాంక్ క్యాపిటల్ అడెక్వసీ రేషియో 14.93 శాతం నుంచి 14.72 శాతానికి తగ్గింది. గత త్రైమాసికంలో బ్యాంక్ మొండి బకాయిలను పూడ్చుకోవడానికి కేవలం రూ.50.49 కోట్ల నిధులు మాత్రమే వెచ్చించింది.

కునారిల్లిన కీలక రంగాలు

- 14 నెలల కనిష్ఠానికి వృద్ధి

న్యూఢిల్లీ, జనవరి 31: దేశ ఆర్థికాభివృద్ధికి అవసరమైన వనరుల్ని, ముడి పదార్థాలను అందించే కీలకమైన ఎనిమిది మౌలిక రంగాల వృద్ధి నెమ్మదిస్తున్నది. 2023 డిసెంబర్‌లో ఈ రంగాల వృద్ధి 3.8 శాతం మాత్రమే వృద్ధిచెందింది. ఇది 14 నెలల కనిష్ఠస్థాయి. ముడి చమురు, విద్యుత్, ఉక్కు, సిమెంటు రంగాల బలహీనమైన పనితీరుతో ఈ రంగాలు వృద్ధి పడిపోయినట్టు బుధవారం విడుదలైన అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2023 నవంబర్‌లో మౌలిక రంగాలు (బొగ్గు, ముడి చమురు, సహజవాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్) 7.9 శాతం వృద్ధిచెందగా, 2022 డిసెంబర్‌లో 8.3 శాతం వృద్ధి సాధించాయి. 2022 అక్టోబర్‌లో నమోదైన 0.9 శాతం వృద్ధి రేటు తర్వాత కనిష్ఠానికి తగ్గడం 2023 డిసెంబర్‌లోనే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలంలో ఈ ఎనిమిది రంగాల వృద్ధి ఫ్లాట్‌గా 8.1 శాతం వద్ద నమోదయ్యింది. డిసెంబర్ నెలలో బొగ్గు, రిఫైనరీ, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్ ఉత్పత్తి వృద్ధి రేటు తగ్గగా, సహజవాయువు ఉత్పత్తి మాత్రం పెరిగింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచి (ఐఐపీ)లో ఈ రంగాల భాగం 40.27 శాతం మేరకు ఉన్నది. మౌలిక రంగాల బలహీనత వృద్ధి ఫలితంగా 2023 డిసెంబర్‌లో ఐఐపీ వృద్ధి రేటు 1-3 శాతం మధ్య పరిమితమవుతుందని అంచనా వేస్తున్నట్టు ఇక్రా చీఫ్ ఎకానమిస్ట్ అదితి నాయర్ చెప్పారు.

డిసెంబర్‌లో కీలక రంగాల వృద్ధి తీరు ఇలా

రంగం	2023	2022
ముడి చమురు	-1	-1.2
విద్యుత్	0.6	10.4
ఉక్కు	5.9	12.3
సిమెంట్	1.3	9.5
సహజవాయువు	6.6	2.6
ఎరువులు	5.8	7.3
రిఫైనరీ ఉత్పత్తులు	2.6	3.7
బొగ్గు	10.6	12.3

హైదరాబాద్‌లో దాసోస్ యూనిట్

రూ.40 కోట్లతో ఏర్పాటు

హైదరాబాద్, జనవరి 31: గ్రానైట్ల తయారీ సంస్థ దాసోస్..తాజాగా హైదరాబాద్‌లో హోమ్ ఇంటీరియర్ సేవలు ప్రారంభించింది. గృహానికి సంబంధించిన అన్ని రకాల పస్తువులను అందించాలనే ఉద్దేశంతో నగరానికి సమీపంలో తూప్రాన్ వద్ద రూ.40 కోట్ల పెట్టుబడితో ప్రత్యేక ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించినట్టు కంపెనీ ఈడీ మనోజ్ కశ్యప్ తెలిపారు. 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌తో వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. జర్మనీ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్, ఈక్విప్‌మెంట్‌తో మాడ్యులర్ ఫర్నిచర్‌ను ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. తమ వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి రూ.100 కోట్ల మేర పెట్టుబడి పెట్టబోతున్నట్లు ఆయన ప్రకటించారు.

బంగారానికి ధరాఘాతం

- దేశంలో గత ఏడాది తగ్గిన గిరాకీ
- 3 శాతం క్షీణతతో 747.5 టన్నులకే పరిమితం

ముంబై, జనవరి 31: దేశంలో బంగారం గిరాకీ గత ఏడాది తగ్గుముఖం పట్టింది. 2022తో పోల్చితే 2023లో గోల్డ్ డిమాండ్ 3 శాతం పడిపోయినట్టు బుధవారం 'గోల్డ్ డిమాండ్ ట్రెండ్స్ రిపోర్టు 2023' పేరిట విడుదలైన ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) నివేదికలో స్పష్టమైంది. నిరుడు 747.5 టన్నులకే పరిమితమైనట్టు చెప్పున్నారు. అంతకుముందు ఏడాది 774.1 టన్నులుగా ఉన్నదని పేర్కొంటున్నారు. అధిక ధరలు, తీవ్ర ఒడిదొడుకులే ఇందుకు కారణమని డబ్ల్యూజీసీ అంటున్నది. కాగా, ధరలు స్థిరంగా ఉంటే ఈ ఏడాది 800-900 టన్నుల పసిడి అమ్ముడుపోగలదని మండలి ఈ సందర్భంగా అంచనా వేస్తున్నది.

ప్రపంచవ్యాప్తంగా..

ప్రపంచవ్యాప్తంగా గోల్డ్ డిమాండ్ నిరుడు 5 శాతం దిగజారి 4,448.4 టన్నులుగానే ఉన్నట్టు డబ్ల్యూజీసీ వెల్లడించింది. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్)ల నుంచి పెట్టుబడులు తరలిపోవడం ప్రభావితం చేసినట్టు చెప్పున్నది. అంతకుముందు రెండేండ్లలోనూ గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ జరిగిందని డబ్ల్యూజీసీ గుర్తుచేస్తున్నది. ఇక 2013 నుంచి ఎన్నడూ లేనంతగా యూరప్‌లో డిమాండ్ క్షీణించిందని 180 టన్నులకు పతనమైనట్టు ప్రపంచ స్వర్ణ మండలి తెలియజేసింది. ఆయా దేశాల సెంట్రల్ బ్యాంక్‌ల పసిడి కొనుగోళ్లూ నిరుడు 45 టన్నులు తగ్గి 1,037 టన్నులుగానే ఉన్నాయి. చైనా బ్యాంక్ మాత్రం 225 టన్నులతో ముందున్నది. అయితే అంతర్జాతీయ ఉద్రిక్తతలు, వాణిజ్య ఆందోళనలు, ఎన్నికల నడుమ మదుపరులు తమ పెట్టుబడులను బంగారం వైపు మళ్లిస్తే.. ఈ ఏడాది డిమాండ్ పెరుగవచ్చన్న ఆశాభావాన్ని డబ్ల్యూజీసీ వ్యక్తం చేసింది.

- గత ఏడాది దేశంలో నగల విక్రయాలు 6 శాతం క్షీణించి 562.3 టన్నులుగానే ఉన్నాయి. 2022లో 600.6 టన్నులుగా ఉన్నాయి.
- 2023లో బంగారం కడ్డీలు, నాణేలపై పెట్టుబడులు 7 శాతం పెరిగి 185.2 టన్నులుగా ఉన్నాయి. అంతకుముందు ఏడాది 173.6 టన్నులే. నిరుడు అక్టోబర్-డిసెంబర్‌లో డిమాండ్ 67 టన్నులకు చేరింది. ఇది గడిచిన ఐదేండ్ల త్రైమాసిక సగటు కన్నా 64 శాతం అధికం.
- నిరుడు దేశంలోకి జరిగిన మొత్తం పుత్తడి దిగుమతులు 780.7 టన్నులుగా ఉన్నాయి. 2022తో పోల్చితే 20 శాతం ఎక్కువ. నాడు 650.7 టన్నులే.
- 2023లో గోల్డ్ రీసైక్లింగ్ 20 శాతం పెరిగి 117 టన్నులుగా నమోదు.
- ఆర్బీఐ వద్ద గత ఏడాది 16.2 టన్నులు పెరిగిన బంగారం నిల్వలు. 2022లో 32 టన్నులు పెరిగాయి.

గత ఏడాది దేశీయంగా పసిడి అమ్మకాలు 3 శాతం క్షీణించాయి. పెరుగుతున్న బంగారం ధరలే ఇందుకు కారణం. అయినప్పటికీ ఈ ఏడాది దేశంలోకి బంగారం దిగుమతులు డిమాండ్‌ను మించి జరుగవచ్చు. చాలా దేశాలతో భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ) కలిసొస్తాయనిపిస్తున్నది.

-సోమ సుందరం,
డబ్ల్యూజీసీ ఇండియా ప్రాంతీయ సీఈవో

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్..దేశీయ మార్కెట్లోకి నూతన జీఎల్‌ఏ ఎస్‌యూవీ లగ్జరీ కారును ప్రవేశపెట్టింది. ఈ కారు రూ.50.5 లక్షల నుంచి రూ.56.9 లక్షల మధ్యలో లభించనున్నది. ప్రత్యేక ఎడిషన్‌గా విడుదల చేసిన ఏఎంజీ జీఎల్‌ఈ 53 మ్యాటిక్ ప్రారంభ ధర రూ.1.85 కోట్లు.

మారుతికి అమ్మకాల దన్ను

క్యూ3లో రూ.3,207 కోట్ల లాభం

న్యూఢిల్లీ, జనవరి 31: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ లాభాలకు అమ్మకాలు దన్నుగా నిలిచాయి. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.3,207 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. 2022-23 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,406 కోట్ల లాభంతో పోలిస్తే 33 శాతం పెరిగింది. కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 15 శాతం ఎగబాకి రూ.33,513 కోట్లకు చేరుకున్నది. గతేడాది ఇది రూ.29,251 కోట్లుగా ఉన్నది.

- గత త్రైమాసికంలో సంస్థ 5,01,207 యూనిట్ల కార్లను విక్రయించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో విక్రయించిన 4,65,911 యూనిట్లతో పోలిస్తే 8 శాతం అధికం.
- చిన్న కార్లకు డిమాండ్ అంతకంతకు పడిపోయినప్పటికీ దేశీయంగా సంస్థ 4,29,422 యూనిట్ల వాహనాలను విక్రయించడం విశేషం.
- 71,785 యూనిట్ల వాహనాలను ఇతర దేశాలకు ఎగుమతి చేసింది.
- ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్యకాలంలో 15,51,292 యూనిట్ల వాహనాలను విక్రయించింది. వీటిలో దేశీయంగా 13,46,965 యూనిట్లు కాగా, 2,04,327 కార్లను ఇతర దేశాలకు ఎగుమతి చేసింది.
- గత తొమ్మిది నెలల్లో రూ.1,03,387 కోట్ల ఆదాయంపై రూ.9,536 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది.

భారత్‌లో విలువైన కంపెనీ ఆర్‌ఐఎల్

ప్రపంచంలో 44వ స్థానం • 2023 హురున్ గ్లోబల్-500 జాబితా

న్యూఢిల్లీ, జనవరి 31: భారత్‌లో అత్యంత విలువైన కంపెనీగా ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) నిలిచింది. బుధవారం విడుదలైన 2023 హురున్ గ్లోబల్-500 జాబితా ప్రకారం ప్రపంచ కార్పొరేట్ దిగ్గజాల్లో ఆర్‌ఐఎల్ 198 బిలియన్ డాలర్ల విలువతో 44వ స్థానాన్ని సంపాదించింది. అయితే 2022తో పోలిస్తే ఈ కంపెనీ విలువ గత ఏడాది 2023లో 2 శాతం తగ్గినందున పది స్థానాల్ని కోల్పోయింది. టాప్-100లో మొత్తం మూడు భారతీయ కంపెనీలు ఉన్నాయి. వివరాలు...

- ఆర్‌ఐఎల్ తర్వాత టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 60వ స్థానంలోనూ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 68వ స్థానంలోనూ ఉన్నాయి.
- 2023లో టీసీఎస్ షేరు 14 శాతం పెరగడంతో 158 బిలియన్ డాలర్ల విలువతో 5 స్థానాల్ని మెరుగుపర్చుకుంది.
- మాతృసంస్థ హెచ్‌డీఎఫ్‌సీ విలీనం కావడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏకంగా 43 మెట్లు ఎక్కి 68వ స్థానాన్ని అందుకుంది.
- హురున్ గ్లోబల్ టాప్ 500 ర్యాంకింగ్స్‌లో కొత్తగా చేరిన భారతీయ కంపెనీల్లో అవి..యాపిల్, మైక్రోసాఫ్ట్, అల్ఫాబెట్ (గూగుల్ మాతృసంస్థ), అమెజాన్, సెమికండక్టర్స్ కంపెనీ ఎన్‌విడియాలు. జాబితాలో ఇవి వరుసగా తొలి ఐదు ర్యాంకుల్లో ఉన్నాయి.
- సంచలనం సృష్టిస్తున్న ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) సాఫ్ట్‌వేర్ చాట్‌జీపీటీ కారణంగానే మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియాల విలువ గణనీయంగా పెరిగింది. చాట్‌జీపీటీ సృష్టికర్త ఓపెన్‌ఏఐలో మైక్రోసాఫ్ట్ భారీ పెట్టుబడులు చేయడం, ఏఐకి అవసరమైన సెమికండక్టర్స్‌ను ఎన్‌విడియా సరఫరా చేస్తుండటం ఇందుకు కారణం.
- తైవాన్‌కు చెందిన మరో సెమికండక్టర్ కంపెనీ టీఎస్‌ఎంసీ 512 బిలియన్ డాలర్ల విలువతో టాప్-10లో చోటు సంపాదించింది.
- కొత్తగా వెయిట్‌టాస్ ఔషధం జెప్‌బౌండ్‌ను ప్రవేశపెట్టిన ఫార్మా దిగ్గజం ఎలి లిల్లీ సైతం 526 బిలియన్ డాలర్ల విలువతో తొలిసారిగా టాప్-10లోకి అడుగుపెట్టింది.

టైటాన్, సన్‌ఫార్మాలు ఉన్నాయి.

- అయితే విలువలు క్షీణించిన కారణంగా జాబితా నుంచి 48 భారతీయ కంపెనీలు వైదొలిగాయి. ఇందులో అదానీ గ్రూప్ కంపెనీలు అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్‌లు ఉన్నాయి.
- మొత్తం టాప్ 500 కంపెనీల్లో భారత్ కంపెనీలు 18 మాత్రమే ఉన్నాయి. అధిక విలువకలిగిన కంపెనీలు ఉన్న దేశాల జాబితాలో భారత్ ఒక ర్యాంక్ కోల్పోయి ఆరవ స్థానంలో నిలిచింది.
- ప్రపంచ చరిత్రలో తొలిసారిగా 1 ట్రిలియన్ డాలర్ల విలువను ఐదు కంపెనీలు అందుకున్నాయని హురున్ తెలిపింది.

16వ ఆర్థిక సంఘం సభ్యుల నియామకం

న్యూఢిల్లీ, జనవరి 31: కొత్తగా ఏర్పాటైన 16వ ఆర్థిక సంఘంలో నలుగురు సభ్యులను కేంద్ర ప్రభుత్వం నియమించింది. నీతి ఆయోగ్ మాజీ వైస్ చైర్మన్ అర్వింద్ పనగరియా నేతృత్వంలో వచ్చిన ఈ ఫైనాన్స్ కమిషన్‌లో సభ్యులుగా మాజీ వ్యయ కార్యదర్శి అజయ్ నారాయణ్ ఝా, ఎస్బీఐ గ్రూప్ చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ సౌమ్య కాంతి ఘోష్, రిటైర్డ్ బ్యూరోక్రాట్ అన్నీ జార్జ్ మాథ్యూ, అర్థ గ్లోబల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిరంజన్ రాజాధ్యక్షలను ఎంపిక చేసింది. ఇందులో అజయ్ నారాయణ్ ఝా 15వ ఆర్థిక సంఘంలోనూ సభ్యుడిగా ఉన్నారు. కాగా, అజయ్, జార్జ్, నిరంజన్‌లు కమిషన్‌లో పూర్తిస్థాయి సభ్యులుగా ఉండనుండగా, సౌమ్య మాత్రం పార్ట్-టైం మెంబర్‌గా ఉంటారని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. గత ఏడాది డిసెంబర్ 31న ఏర్పాటైన ఈ కమిషన్.. 2025 అక్టోబర్ 31కల్లా తమ రిపోర్టును సమర్పించాల్సి ఉన్నది. 2026 ఏప్రిల్ 1 నుంచి మొదలయ్యే ఐదేండ్ల కోసం ఇది సిద్ధమవుతున్నది.

పేటీఎంకు ఆర్బీఐ షాక్

పేమెంట్స్ బ్యాంక్‌పై కఠిన ఆంక్షలు • ఈ నెల 29 తర్వాత దాదాపు అన్ని సేవలు బంద్

ముంబై, జనవరి 31: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్)పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కొరడా ఝళిపించింది. బుధవారం పెద్ద ఎత్తున ఆంక్షలు విధించింది. దీంతో ఈ నెల 29 తర్వాత దాదాపుగా అన్ని పీపీబీఎల్ సేవలు నిలిచిపోనున్నాయి. కస్టమర్ అకౌంట్లు, వ్యాలెట్లు, ఫాస్టాగ్స్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డు (ఎన్‌సీఎంసీ)లు, ఇతర సాధనాల్లో టాప్-అప్‌లు లేదా డిపాజిట్లను అంగీకరించడానికి పీఎల్‌బీఎల్‌కు ఆర్బీఐ తేల్చి చెప్పింది. అయితే వడ్డీ, క్యాష్‌బ్యాక్స్ లేదా రిఫండ్స్‌ను కస్టమర్లకు ఎప్పుడైనా చెల్లించుకొనే వెసులుబాటు కల్పించింది. 'పీపీబీఎల్ కస్టమర్లు తమ సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలు, కరెంట్ ఖాతాలు, ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫాస్టాగ్స్, ఎన్‌సీఎంసీల్లో బ్యాలెన్స్ ఉంటే దాన్ని ఎటువంటి ఆంక్షలు లేకుండా ఉపసంహరించుకోవడం లేదా వాడుకోవడం చేయవచ్చు' అని ఆర్బీఐ ఈ సందర్భంగా స్పష్టం చేసింది. దీంతో బ్యాంక్ నుంచి పోయేదేమీ లేదని, వచ్చే ఆదాయ మార్గాలన్నీ మూసుకుపోయినట్టైంది.